సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



కేఎంసీకి మరో ఖ్యాతి - 8లో

కాకతీయ మెడికల్ కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ 250 మెడికల్ సీట్లను సాధించుకుని మెరుగైన వైద్యవిద్యను అందిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం మరో మైలురాయిని అధిగమించింది.



మావోయిస్టు దళసభ్యుడి లొంగుబాటు - 8లో

సీపీఐ మావోయిస్టు దళసభ్యుడు మీడియం జోగయ్య అలియాస్ జంగు అలియాస్ జోగ శుక్రవారం లొంగిపోయాడు.

గరిష్టం/కనిష్టం
35.0^0 /23.0^0

వాతావరణం

జిల్లాలో ఆకాశం ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రి సమయంలో కాస్త చలి వాతావరణం ఉంటుంది.



గంజాయ్.. ఎంజాయ్

మహమ్మారికి బానిసగా మారుతున్న యువత

- ఏఓబీ పరిసరాల నుంచి దిగుమతి
- దందాలో రాష్ట్ర, అంతర్రాష్ట్ర ముఠాలు
- జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు
- యువత పెడదారి..


భూపాలపల్లి: గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా సాగు, రవాణా, వాడకం మాత్రం ఆగడం లేదు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దులో పండించిన గంజాయిని జిల్లా, ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాలు ఇక్కడ జోరుగా విక్రయాలు జరుపుతున్నాయి. ఫలితంగా యువత మత్తుకు బానిసై పెడదారి పడుతోంది.

18 నుంచి 22 ఏళ్లలోపు వారే..

గంజాయి సేవిస్తున్న వారిలో ప్రధానంగా యువకులే ఉన్నారు. నూటికి 90శాతం 18నుంచి 22ఏళ్లలోపు యువకులే ఉన్నట్లు తెలుస్తోంది. తొలుత సిగరేట్‌లకు బానిసైన వీరు కొద్ది రోజులకు గంజాయికి వ్యసనపరులుగా మారుతున్నారు. సిగరేట్‌లలోని పొగాకును తొలగించి ఎండు గంజాయిని నింపి సేవిస్తున్నారు. ఖాళీ ప్లాస్టిక్ బాటిల్‌లో ఎండు గంజాయిని వేసి, అందులో అంటించిన అగ్గిపుల్లను వేశాక వచ్చే పొగను పీల్చి మత్తులో తూగుతున్నారు. ఇంటర్ విద్యార్థులకు పరీక్షల కాలం ముగియడంతో హనుమకొండ, హైదరాబాద్‌లో చదువుకుంటున్న యువత సొంతూళ్లకు చేరుకుంది. అలవాటు ఉన్న వారు ఇప్పుడు మళ్లీ మత్తులో తూగుతున్నారు. గంజాయి రవాణా చేస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. పలువురు అనుమానితులపై ఇప్పటికే సస్పెక్ట్ షీట్లు కూడా నమోదు చేస్తున్నారు. గతంలో గంజాయి రవాణా, క్రయ, విక్రయాలు జరిపిన వారిని జిల్లా వ్యాప్తంగా 50మందికి పైగా గుర్తించిన పోలీసులు సస్పెక్ట్ షీట్లు నమోదుచేశారు. వినియోగిస్తున్న యువకులను గుర్తించి వారి తల్లితండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినప్పటికీ కొంత మంది తీరులో మార్పు రావడం లేదు.

ఒడిశా సరిహద్దు నుంచి దిగుమతి..

పోలీసులు గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు(ఏఓబీ) నుంచి గంజాయి రవాణా జోరుగా సాగుతోంది. ఏవోబీ సరిహద్దులో గల సీలేరు, పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం, బలిమెల గ్రామాల సమీప అడవుల్లో గంజాయి సాగు జరుగుతోంది. ఇటీవలే పంట చేతికి రాగా ఎండబెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. అక్కడి గంజాయిని జిల్లా, ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు స్మగ్లర్లు కొనుగోలుచేసి జిల్లాకు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. ఏఓబీ దగ్గర ప్రస్తుతం ఒక కేజీ ఎండు గంజాయి రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఉన్నట్లు సమాచారం. స్మగ్లర్లు ఇదే గంజాయిని పట్టణాల్లో కేజీ రూ.20వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఒక క్వింటాల్‌కు సుమారు రూ.15లక్షల వరకు లాభం ఉంటుంది. దీంతో కేసుల పాలు అవుతున్నప్పటికీ కొందరు స్మగ్లర్లు ఈ దందాను వీడటం లేదు.



న్యూస్‌రీల్

ఉద్యోగ విరమణ అనివార్యం



భూపాలపల్లి: ఉద్యోగ విరమణ ప్రతీ ఒక్కరికి అనివార్యమని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి హెడ్ కానిస్టేబుల్ ఉచ్చిడి రాజు స్వచ్ఛంద పదవి విరమణ చేయగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులుతో కలిసి ఎస్పీ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. తొలుత రాజును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో 25ఏళ్ల పాటు పనిచేసి ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయం అన్నారు. రాజుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని డీపీఓ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్


ఎదులపురం శ్రీనివాస్


పగడాల ఆనందరావు

భూపాలపల్లి అర్బన్: జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎదులపురం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పగడాల ఆనందరావు ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా ప్రధాన కోర్టు ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది శ్రావణ్‌రావు వ్యవహరించారు. జిల్లాలో 53మంది ఓటు హక్కు కలిగిన న్యాయవాదులు ఉండగా 52మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సంపత్, వసుందర్, జాయింట్ సెక్రటరీగా కవిత, కోశాధికారిగా వెంకటస్వామి, కల్చరల్, స్పోర్ట్స్ కన్వీనర్‌గా చిరంజీవి, లైబ్రేరియన్‌గా ప్రియాంక. సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీనివాసచారి, మహిళ మెంబర్‌గా అక్షయ, ఈసీ మెంబర్లుగా రమేష్‌నాయక్, రాకేష్, రమేష్, విష్ణు ఎన్నికైనట్లు ప్రకటించారు.

సీఐగా రాంనర్సింహారెడ్డి బాధ్యతల స్వీకరణ



భూపాలపల్లి: భూపాలపల్లి సీఐగా రాంనర్సింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజిరెడ్డి కొద్ది రోజుల క్రితం ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లగా నిర్మల్ జిల్లాలోని సోన్ సీఐగా పనిచేస్తున్న రాంనర్సింహారెడ్డిని భూపాలపల్లికి బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని బాధ్యతలు స్వీకరించారు.

జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని జర్నలిస్టుల కోసం తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నేడు, రేపు నిర్వహించనున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో భూపాలపల్లి సింగరేణి ఇల్లందు క్లబ్‌హౌస్ సమావేశ మందిరంలో ఈనెల 1, 2 తేదీలలో రెండు రోజులపాటు జర్నలిస్టుల శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, కలెక్టర్ భవేష్‌మిశ్రా, శాసన సభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్, శ్రీహర్షిణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి హాజరుకానున్నట్లు తెలిపారు.

బీజేపీ అధికారంలోకి రావాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

భూపాలపల్లి రూరల్: తెలంగాణ ప్రజల కలలు నెరవేరాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని, అందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మంజూర్‌నగర్‌లో పార్టీ జిల్లా కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆన్‌లైన్(వర్చువల్)లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాలను భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డితో కలిసి ఆమె వీక్షించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో అరుణ మాట్లాడారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల్లో నూతనంగా పార్టీ కార్యాలయాలను నిర్మించుకొని జేపీ నడ్డా చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవాల సందర్భంగా జేపీ నడ్డా ప్రజలకు పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమైన ప్రసంగాన్ని అందించి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అందుకు అనుగుణంగా పార్టీ నాయకత్వం రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు వెళ్లుతుందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. లీకేజీ వ్యవహారంలో బాధిత నిరుద్యోగులకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధితుల తరపున నిరసన వ్యక్తంచేస్తే యువమోర్చా నాయకులపై అక్రమ కేసులు బనాయించారని గుర్తుచేశారు. పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల పక్షాన ఇందిరాపార్క్ వద్ద నిరసన దీక్ష చేపట్టామని తెలిపారు. తెలంగాణలో ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరిగినా వారి పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని.. 2024 ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు వెన్నంపల్లి పాపయ్య, రేగొండ సర్పంచ్ నిశీధర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎరుకల గణపతి, దొంగల రాజేందర్, పార్టీ అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పోశాల రాజు పాల్గొన్నారు.

ఉత్పత్తిలో ఏఎమ్మార్ టాప్

- 25లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పూర్తి
- మైన్ రక్షణ చర్యల్లో జాతీయ అవార్డు
- భద్రత పోటీల్లో ప్రాక్టీసెస్ ఇన్ సేఫ్టీ అవార్డు
- ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి


తాడిచర్ల ఓపెన్ కాస్ట్ మైన్

మల్హర్: బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో మల్హర్ మండలం తాడిచర్ల ఓపెన్ కాస్ట్ మైన్ నిర్దేశించిన 100శాతం లక్ష్యాన్ని ఒక రోజు ముందుగానే పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తి సాధనలో టాప్‌గా నిలిచిందని ఏఎమ్మార్ కంపెనీ మైన్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మైన్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన 25లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి టార్గెట్‌ను చేరుకున్నామని వెల్లడించారు. 25సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేనంత భారీ వర్షాలు కురిసినా కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో అన్ని అడ్డంకులనూ అధిగమించి నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. తాడిచర్ల గని బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా రక్షణలో ముందుండి రక్షణ సంబంధిత అవార్డులను జాతీయస్థాయిలో గెలుచుకుందని తెలియజేశారు. 2019 సంవత్సరంలో జరిగిన 52వ భద్రత వారోత్సవ పోటీల్లో బెస్ట్ ప్రాక్టీసెస్ సేఫ్టీ అవార్డు, అత్యంత ప్రతిష్టాత్మమైన 2021 జాతీయ భద్రతా అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. 2020, 2021 సంవత్సరాలల్లో వరుసగా బొగ్గు మంత్రిత్వ శాఖ అందించే స్టార్ రేటింగ్‌లో ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి బొగ్గుని టాప్ 10వ స్థాన సంపాందించి, దేశంలో అత్యుత్తమ ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. మైన్ స్టేఫ్టీ కోసం అధికారులను, సూపర్ వైజర్స్, కార్మికులను నాగపూర్‌లోని ఎన్‌పీటీఐ ట్రైనింగ్ సెంటర్‌లో ఇన్ హౌస్ సేఫ్టీ ట్రైనింగ్‌కు పంపించినట్లు తెలిపారు. టీఎస్ జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డైరెక్టర్ టీఆర్కే రావు, ఏజెంట్ బాలరాజు, జనరల్ మేనేజర్ మోహన్‌రావు, ఏఎమ్మార్ ఎండీ మహేష్‌కుమార్‌రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లు విశ్వనాథ్‌రాజు, శ్రీధర్‌లు హర్షం వ్యక్తంచేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు సాగాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడిగా మోహన్


బండ మోహన్, అధ్యక్షుడు


అంబాల సంపత్, ప్రధాన కార్యదర్శి

భూపాలపల్లి: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా బండ మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన యూనియన్ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథెన సమ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులు సమాజంలో నేటికీ వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దళిత, గిరిజన జర్నలిస్టులను ఏకం చేసి హక్కుల సాధన కోసం ఉద్యమం ప్రారంభించామన్నారు. ఈ మేరకు భూపాలపల్లి కమిటీని ప్రకటించినట్లు తెలిపారు. యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా బండ మోహన్, ప్రధాన కార్యదర్శిగా అంబాల సంపత్, కోశాధికారిగా కడపాక రవి, ఉపాధ్యక్షులుగా అజ్మీరా డాకు నాయక్, కటుకూరి మొగిళి, రైతు కిషోర్, సహాయ కార్యదర్శులుగా గుర్రపు చందు, దాసారపు ప్రశాంత్, అంబాల రవీందర్, అధికార ప్రతినిధిగా రడపాక రమేష్, గౌరవ అధ్యక్షుడిగా దొమ్మాటి రవీందర్, ముఖ్య సలహాదారులుగా ఎర్రం సతీష్, చెరుకు సుధాకర్, తిక్క ప్రవీణ్‌లతోపాటు సభ్యులుగా శంకర్, సత్యనారాయణ, సుమన్, రాజబాబులను ఎన్నుకున్నట్లు మల్లేష్, సమ్మయ్య తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీరేశం

మొగుళ్లపల్లి: తన ఇంటి వద్ద కార్ పార్కింగ్ చేస్తున్న ఆరే సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై అకారణంగా దాడి చేసిన వ్యక్తులను కఠినంగా గుర్తించి శిక్షించాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వంచనగిరి వీరేశం డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిందితులను పోలీసులు గుర్తించి శిక్షించాలన్నారు. లేకుంటే త్వరలోనే తమ కులస్తులు రంగంలోకి దిగి ఆ వ్యక్తులను ఎక్కడున్నా దొరకబట్టి తగిన రీతిలో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. మొగుళ్లపల్లి ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికై జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ మోటే ధర్మరావును ఈ సందర్భంగా సంఘం నాయకులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అడగాని జగన్మోహన్‌రావు, రంపీస రవీంద్రరావు, లాండే శంకర్‌రావు, జిల్లా నాయకులు కరాబు మలహల్ రావు, రక్తాన్ని గోపాలరావు, లాండే సాంబశివరావు, లోనే శివాజీ, మండల అధ్యక్షుడు జమలాపురం లక్ష్మణరావు, గణేష్ పల్లి సర్పంచ్ తిప్పారపు యుగంధర్ పాల్గొన్నారు.

సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు


శిక్షణ ఇస్తున్న డాక్టర్లు

భూపాలపల్లి అర్బన్: ఆకస్మికంగా గుండెపోటుతో చనిపోతున్న వారిని సీపీఆర్ చేయడం ద్వారా కాపాడవచ్చని.. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. శుక్రవారం ఇల్లందు క్లబ్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జ్ వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ అధ్యక్షతన కార్డియో పల్మనరీ రిసోసియేషన్ (సీపీఆర్) శిక్షణ ప్రజాప్రతినిధులకు, వైద్య సిబ్బందికి, అధికారులకు, ఉద్యోగులకు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. కోవిడ్ అనంతరం చాలామంది గుండెనొప్పి కారణంగా ఆకస్మికంగా మృతి చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక వ్యక్తికి అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టు అయినప్పుడు వారికి సీపీఆర్, ఏఈడీ చేసినట్లయితే ప్రమాదం నుంచి కాపాడగలుగుతామని అన్నారు. ప్రాణానికి మించి ఏది లేదని, మన చుట్టుప్రక్కల వారు ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలిపోతే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిస్తూ, వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తూ, ఊపిరి అందిస్తే ఒక నిండు ప్రాణాన్ని కాపాడొచ్చని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ పొందిన ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అన్వేషిని, డాక్టర్ ప్రమోద్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణిసిద్దు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

పునరావాస పథకానికి దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఆర్థిక పునరావాసం పథకం కింద ఉపాధి పొందేందుకు అర్హులైన ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమ అధికారిణి టి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50వేల విలువ గల రెండు యూనిట్‌లను జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు. ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్, ఐడెంటిటీ కార్డు కలిగిన అర్హులైన వారు ఈ నెల 10వ తేదీలోపు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 96523 11804 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మల్లంపల్లికి రాష్ట్రస్థాయి అవార్డు



ములుగు: సెల్ఫ్ షఫీసియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రామ పంచాయతీ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక అయిన మల్లంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ చందా కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి పోలు రాజు శుక్రవారం రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని ఆడిటోరియంలో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి, మల్లారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును తీసుకున్నారు. ఈ మేరకు సర్పంచ్, కార్యదర్శిని మంత్రులు శాలువాలతో సన్మానించారు.

నవాబుపేటకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామం నేషనల్ అవార్డులో (కార్బన్ న్యూట్రాలిటీ) పర్యావరణ ప్రకృతి విభాగంలో ఎంపికైంది. అందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నిక కావడంతో శుక్రవారం ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్‌రెడ్డి, గ్రామ పంచాయితీ కార్యదర్శి సుచరితరెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారిని అభినందించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని, డీపీఓ ఆశాలత ఉన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పాలి

గండ్ర సత్యనారాయణరావు


మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణరావు మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, దోపిడీని నివారించి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దేశంలోని ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తంచేశారు. పరువు నష్టం కేసులో ఇప్పటి వరకు ఎవరికీ శిక్ష పడలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఇస్లావత్ దేవన్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ముఖ్య నాయకులు పిప్పాల రాజేందర్, మహేందర్, తోట రంజిత్, హఫీజ్, నగునూరి రజిని కాంత్, కేతిరి సుభాష్, కిషోర్ రెడ్డి, గురిజాల రవి పాల్గొన్నారు.

వర్గీకరణ చేపట్టాలి

ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి


కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

భూపాలపల్లి రూరల్: ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కన్వీనర్ గట్ల రాజన్న ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంబాల చంద్రమౌళి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 28సంవత్సరాలుగా ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతుందన్నారు. అనేక ప్రభుత్వాలు, పార్టీలు ఇచ్చిన హామీలు తప్పుతూ మాదిగలను మోసం చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పిస్తామని హామీఇచ్చి ఇప్పటివరకు నేరవేర్చకుండా మోసంచేస్తూనే ఉందన్నారు. ఇప్పటికైనా వర్గీకరణ చేపట్టాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కోఆర్డినేటర్ నోముల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల భిక్షపతి, నాయకులు బొల్లి బాబు, ఇంజపెల్లి ప్రవీణ్, అంతడుపుల సురేష్, దోర్నాల రాజేందర్, అశోక్, కిరణ్, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో మడ్డపల్లి వాసి

టేకుమట్ల(రేగొండ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని మడ్డపల్లికి చెందిన ఓ వ్యక్తి రూ.2.25లక్షలు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మడ్డపల్లికి చెందిన ఇంజపూరి నర్సయ్యకు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి సెల్ నంబర్ నుంచి ఖాతా బ్లాక్ అయినట్లు మెసేజ్ రావడంతో కంగారుగా నర్సయ్య వెంటనే ఆ నంబర్‌కు కాల్ చేశాడు. వారు ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఏటీఎం వివరాలు చెప్తే ఖాతా అప్‌డేట్ చేస్తామని చెప్పి సెల్‌కి వచ్చిన ఓటీపీ అడగడంతో నర్సయ్య ఓటీపీ చెప్పాడు. దీంతో ఖాతాలోని రూ.2.25లక్షలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు రాత్రి సైబర్‌సెల్‌లో ఫిర్యాదు చేసి, శుక్రవారం ఉదయం రేగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీలో బీఆర్ఎస్ అర్బన్ యూత్ ప్రధాన కార్యదర్శి బోగ రవిచంద్రపై హత్యాయత్నం కేసులో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ సతీష్ శుక్రవారం తెలిపారు. బోగ రవిచంద్ర భార్య శ్రావణి, అత్త రమ, సట్ల యాకయ్య, ప్రశాంత్, సంతోష్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు. కాగా, దాడిలో తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోగ రవిచంద్రను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

స్థలం అప్పగింత

వరంగల్ క్రైం: ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెపల్లిలో కబ్జాకు గురైన స్థలాన్ని తిరిగి యజమాని అయిన కానిస్టేబుల్‌కు అప్పగించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎం టీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పడిదల రవీందర్ 2019లో స్థలం కొనుగోలు చేశాడు. సదరు భూమి ఇటీవల కబ్జాకు గురికావడంతో సీపీ రంగనాథ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు కబ్జాదారులపై కేసు నమోదు చేసి, స్థలం హెడ్‌కానిస్టేబుల్‌కు అప్పగించారు. దీంతో శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు సీపీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పైడిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్ తప్పుడు పత్రాలు సృష్టించి మొండ్రాయి గ్రామానికి చెందిన బొల్ల పెద్ద హైమకు రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. నకిలీ పత్రాలు అని తేలడంతో హైమ తన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకొని పత్రాలను హెడ్ కానిస్టేబుల్‌కు అందజేసింది.

కేఎంసీకి మరో ఖ్యాతి

- మొదటిసారిగా పీజీ సూపర్‌స్పెషాలిటీ సీట్ల మంజూరు
- అభినందనలు తెలిపిన మంత్రి హరీశ్‌రావు

ఎంజీఎం : 1959లో 50 ఎంబీబీఎస్ సీట్లతో స్థాపించబడ్డ కాకతీయ మెడికల్ కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ 250 మెడికల్ సీట్లను సాధించుకుని మెరుగైన వైద్యవిద్యను అందిస్తూ కొనసాగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం మరో మైలురాయిని అధిగమించింది. 1972లో పీజీ సీట్లను సాధించుకున్న కేఎంసీ ప్రస్తుతం 183 సీట్లతో కొనసాగుతున్న క్రమంలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వరంగ కళాశాలలో సూపర్‌స్పెషాలిటీ సీట్లును సాధించి మరోసారి తన ఖ్యాతిని చాటుకుంది. పది రోజుల క్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు పీజీ సీట్ల అనుమతి కోసం ఎంజీఎం ఆస్పత్రితోపాటు కాకతీయ మెడికల్ కళాశాలను సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఎంజీఎం ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగం(ఎంజీఎం క్యాజువాలిటీ)ను సందర్శించి సంతృప్తి చెందిన బృందం సభ్యులు ఎన్ఎంసీకి అందించిన నివేదిక మేరకు ఐదు ఎమర్జెన్సీ సీట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్వర్వులు వెలువడ్డాయి. సూపర్‌స్పెషాలిటీ నెఫ్రాలజీ విభాగంలో మరోఐదు సీట్లను అనుమతినివ్వడంలో వైద్యవర్గాలో హర్షం వ్యక్తం అవుతుంది.

1972లో పీజీ సీట్ల మంజూరు..

కాకతీయ మెడికల్ కళాశాలకు 1972 సంవత్సరంలో మొట్టమొదటి సారిగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం 183 సీట్లతో కొనసాగుతోంది. 2006లో ఎంజీఎం ఆస్పత్రిని అప్పటి ప్రభుత్వం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సదుపాయాలు లేకపోవడంతో నేటి వరకు కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ సీట్లను సాధించలేకపోయింది. ప్రస్తుతం ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంతో పాటు నెఫ్రాలజీ విభాగంలో సీట్ల మంజూరుతో పేద ప్రజలకు మరిన్ని సేవలు అందనున్నాయని వైద్యాధికారులు తెలిపారు.



మెరుగుపడనున్న అత్యవసర విభాగాలు

ఎంజీఎం ఆస్పత్రికి మంజూరైన ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్ పీజీ సీట్లతో ఎంజీఎం ఆస్పత్రిలో అత్యవసర విభాగాల సేవలు మరింత మెరుగుపడనున్నాయి. ఎంజీఎం ఆస్పత్రి నిత్యం పదుల సంఖ్యలోవచ్చే రోగులను పీజీ వైద్యులు పరిశీలించి ఆ రోగిని ఏ విభాగం వైద్యులకు తరలించాలో తక్షణమే నిర్ణయం తీసుకునే అవకాశం ఉండడంతో అత్యవసరం వైద్యం త్వరగా అందే పరిస్థితులను నెలకొనున్నాయి. ఈ సీట్ల మంజూరుపై ఎంజీఎం ఆర్ఎంఓలు మురళీ, దిలీప్ హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. కేఎంసీకి మొట్టమొదటిసారిగా సూపర్‌స్పెషాలిటీ సీట్లను సాధించడంపై మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ ద్వారా వైదారోగ్యశాఖాధికారులను అభినందించారు.

సేవలు మెరుగుపడుతాయి..



కేఎంసీకి మొట్టమొదటిసారిగా సూపర్‌స్పెసాలిటీ సీట్లు రావడం సంతోషంగా ఉంది. కేఎంసీకి మంజూరైన ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లతోపాటు నెఫ్రాలజీ విభాగం పీజీ సీట్లతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందనున్నాయి.

– డాక్టర్ మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

కలెక్టరేట్ ముట్టడి

- ర్యాలీగా చేరుకున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు, కార్యకర్తలు
- కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు


హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

హన్మకొండ/ వరంగల్ రూరల్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్లను ముట్టడించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అప్పటికే కలెక్టరేట్ గేట్లు మూసివేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీగా వచ్చిన ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. దీంతో కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ధర్నాను విరమించుకోవాలని పోలీసులు కోరినా మొదట్లో వినిపించుకోలేదు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల బృందాన్ని తీసుకెళ్లి జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీవత్సకోటకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ మాట్లాడారు. మోదీ ప్రభుత్వం మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి 9 సంవత్సరాలు అవుతున్న కార్యరూపం ఇవ్వకుండా మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. వచ్చే సాధారణ ఎన్నికల లోపు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, దీనిపై స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర, జిల్లా కార్యాలయాల ముట్టడిని చేపడుతామని, 4న రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల జాతీయ రహదారులు ముట్టడిస్తామన్నారు. ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ గంగారం శ్రీనివాస్, జన్ను దినేష్, సుకుమార్, మంద రాజు, ఏకు శంకర్, ముఖేష్, నారాయణ మాదిగ, భిక్షపతి మాదిగ, సదయ్య మాదిగ, వెంకటస్వామి మాదిగ, శనిగరపు రవీందర్ మాదిగ, మధుకర్, సూర్యం, శాంతిసాగర్, మహేష్, సాంబరాజు, భాగ్య, స్వరూప, విమల ఎమ్మెస్పీ వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ బిర్రు మహేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ మాదిగ, ఎమ్మెస్పీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణయ్‌దీప్, విజయ్‌మాదిగ, ఈర్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను మింగిన 'మిషన్' గుంత

- చెరువులో పడి ఇద్దరు బాలురు మృతి
- బహిర్భూమికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు ఘటన
- చాకలి ఐలమ్మనగర్‌లో విషాదఛాయలు


కిరణ్‌సింగ్


దీపక్‌సింగ్


రోధిస్తున్న కుటుంబ సభ్యులు

వరంగల్: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలురు చెరువులో పడి మృతి చెందిన ఘటన గ్రేటర్ వరంగల్ నగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 14వ డివిజన్ ఏనుమాముల సమీపాన ఉన్న చాకలి ఐలమ్మనగర్‌లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న లక్ష్మీబాయి, లఖన్‌సింగ్ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు సంతానం. లఖన్‌సింగ్ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా.. లక్ష్మీబాయి కూలీగా జీవనం కొనసాగిస్తున్నారు. రోజు మాదిరిగానే వీరి పిల్లలు కిరణ్‌సింగ్(12), దీపక్‌సింగ్(9) బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లారు. దీపక్ సింగ్ చెరువులో దిగి జారి గుంతలో పడడాన్ని చూసిన అన్న కిరణ్‌సింగ్ కాపాడేందుకు వెళ్లి అందులోనే పడిపోయారు. గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేయడంతో ఏనుమాముల పోలీసులు చేరుకుని గుంతలో పడిన ఇద్దరు బాలురను బయటకు తీసి సీపీఆర్ చేయడంతో నోటి నుంచి నీళ్లు బయటకు వచ్చాయి. వెంటనే వారిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారని సీఐ తెలిపారు. మిషన్ కాకతీయ పనుల సందర్భంగా తీసిన గుంత లోతుగా ఉండడంతో పిల్లలు అందులోపడి మృతి చెందినట్లు చెప్పారు. సంఘటన స్థలాన్ని ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ సందర్శించారు. పిల్లల తండ్రి లఖన్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహేందర్ తెలిపారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యార్థులేమైనా తీవ్రవాదులా..?

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్
- కేయూ జేఏసీ నేతల అరెస్ట్, విడుదల
- విద్యార్థి సంఘాల నాయకులకు పరామర్శ


జేఏసీ నేతలను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నేతల ఇళ్లలపై పోలీసు బలగాలు అర్ధరాత్రి దాడి చేసి అరెస్ట్ చేయడాన్ని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఖండించారు. విద్యార్థులు ఏమైనా తీవ్రవాదులా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామ్యానికి పాల్పడుతోందని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం కేయూలో జరిగిన ఆందోళన కారణంగా వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన 13 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న విద్యార్థి జేఏసీ నేతలను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్, కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అర్ధరాత్రి యూనివర్సిటీ విద్యార్థిసంఘాల నేతలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ దోషులకు శిక్ష పడే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తే విద్యార్థులపై కేసు నమోదు చేస్తారా అని మండిపడ్డారు. ఈవ్యవహారంపై గవర్నర్‌ను కలుస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సభకు అనుమతి ఇస్తామని నమ్మించి చివరికి వీసీ అనుమతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్రకు చెందిన రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు చేస్తే తెలంగాణ విద్యార్థులపై కేసులు నమోదు చేస్తారా..? అని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పోలీస్‌స్టేషన్‌లో కేయూ నేతలను పరామర్శించి, సెంట్రల్ జోన్ డీసీపీతో మాట్లాడారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందం, జిల్లా అధికార ప్రతినిధి పుప్పాల రజనీకాంత్ ఉన్నారు.

ఇళ్లు ఖాళీ చేయమంటున్నారు..

పోలీసులు అర్ధరాత్రి ఇళ్లపై దాడులు చేసి అరెస్ట్ చేయడంతో ఇంటి యజమానులు ఖాళీ చేయమంటున్నారని జాక్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

జేఏసీ నేతల అరెస్ట్, విడుదల

రెండు రోజుల క్రితం కేయూలో జరిగిన ఘటనపై రిజిస్ట్రార్ ఫిర్యాదుతో 13 మందిపై కాకతీయ యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు జేఏసీ నేతలు ఇట్టబోయిన తిరుపతి యాదవ్, మేడ రంజిత్‌కుమార్, కాడపాక రంజిత్, గుగులోత్ రాజు, మొగిలి వెంకట్‌రెడ్డి, బొట్ల మనోహర్, బండిగ రాకేష్, అరెగంటి నాగరాజు, కామగాని శ్రవణ్‌కుమార్, రంజిత్, మహేష్‌లను అరెస్ట్ చేసి.. వ్యక్తిగత పూచీకత్తులపై విడుదల చేశారు.

రాత్రి పోలీస్ బలగాలు ఇళ్లలను చుట్టుముట్టడం వల్ల పేరెంట్స్ భయాందోళనకు గురయ్యారని చెప్పారు. తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కేయూలో మోహరించిన పోలీసులు


కేయూ పరిపాలనా భవనం వద్ద పోలీసుల బందోబస్తు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివేకానంద, పోతన హాస్టళ్లలో ఉంటున్న పలు విద్యార్థిసంఘాల బాధ్యులను, అలాగే ఇళ్లలో ఉండేవారిని మొత్తం 11మందిని గురువారం అర్ధరాత్రి తర్వాత యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో విద్యార్థులు మళ్లీ ఆందోళనలు చేస్తారనే అనుమానంతో యూనివర్సిటీలో పోలీసులు మోహరించారు. ప్రధానంగా పరిపాలనా భవనం, గెస్ట్‌హౌజ్ ప్రాంతంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. కాగా, అరెస్టయిన జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్ ఇతర బాధ్యులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిరుద్యోగల భరోసాకు ధర్నా చేసిన నాయకులపై యూనివర్సిటీ అధికారులు కేసులు పెట్టడం శోచనీయమన్నారు. 30 లక్షలమంది నిరుద్యోగులతో చెలగాటమాడిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను అరెస్టుచేయని ప్రభుత్వం వారి పక్షాన కొట్లాడేవారిపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మావోయిస్టు దళసభ్యుడి లొంగుబాటు


జోగయ్యకు తక్షణ సాయం అందజేస్తున్న ఓఎస్డీ

ములుగు: సీపీఐ మావోయిస్టు దళసభ్యుడు మీడియం జోగయ్య అలియాస్ జంగు అలియాస్ జోగ శుక్రవారం ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్ ఎదుట లొంగిపోయాడు. ఓ ఓఎస్డీ తెలిపిన వివరాల ప్రకారం.. పూజారి కాంకేర్ ఆర్పీసీ, మిలీషియా కమాండర్ సోడి నర్సింగ రావు అండతో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 2016లో దళంలో చేరాడు. 2017లో పార్టీ సభ్యుడిగా పదోన్నతితోపాటు చర్ల స్పెషల్ గెరిల్లా స్క్వాడ్‌కి బదిలీ అయ్యాడు. 2020 అక్టోబర్ వరకు దళసభ్యుడిగా చేసి అదే సంవత్సరంలో ఏరియా కమిటీ మెంబర్‌గా దామోదర్ ప్రొటెక్షన్ టీంకు బదిలీ అయ్యాడు. ప్రస్తుతం ఇతనిపై రూ.4లక్షల రివార్డు ఉన్నట్లుగా ఓఎస్డీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్, వెంకటాపురం(కె) ఏరియాలో హత్యలు చేయడం, ఎన్‌కౌంటర్, బాంబులు అమర్చడం వంటి ఆరు కేసులు ఉన్నాయి. ప్రస్తుతం మావోయిస్టులపై తీవ్ర విరక్తి, వ్యతిరేకత, ప్రజలపై చేస్తున్న దాడులను చూసి సహించలేక లొంగినట్లుగా జోగయ్య చెప్పినట్లు ఓఎస్డీ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ సాయాన్ని అందించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


మల్లయ్య (ఫైల్)

ఖానాపురం: మండల కేంద్రానికి చెందిన అడ్డిచర్ల మల్లయ్య (71) ఇంట్లో విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై తిరుపతి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మలయ్య శుక్రవారం ఉదయం మోటార్‌ను రిపేరు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతుడి కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మల్లయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం


కొండయ్య (ఫైల్)

నల్లబెల్లి: కుటుంబ కలహాలకు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రేలకుంటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేలకుంటకు చెందిన అజ్మీరా జనాబాయి, కొండయ్య(48) దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా తరచుగా కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో కొండయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మార్చి 28న ఆర్థిక ఇబ్బందుల విషయంలో భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన కొండయ్య గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కొండయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొత్తపేటలో యువకుడు..


సుమన్(ఫైల్)

వరంగల్: గ్రేటర్ వరంగల్ నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన అంకేశ్వరపు సుమన్(26) ఆర్థిక ఇబ్బందులు భరించలేక శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కొత్తపేటకు చెందిన అంకేశ్వరపు పైడి, కేతలకు మూడో సంతానం సుమన్. తండ్రి పదేళ్ల క్రితం, అక్క దీర్ఘకాలికవ్యాధితో మృతి చెందారు. అన్నలు ఇద్దరు తమ కుటుంబాలతో వరంగల్‌లో జీవనం సాగిస్తుండడంతో తల్లి పోషణభారం సుమన్‌పై పడింది. కూలీ పనిచేస్తున్న సుమన్ తల్లి దీర్ఘకాలిక వ్యాధికి గురికావడంతో చికిత్స నిమిత్తం అప్పులు చేసినట్లు సమాచారం. అప్పుల బాధ తాళలేక జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్సై రాజన్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ప్రయాణికులపై టోల్ పిడుగు..!

- డబుల్ టచ్‌కు రూ.10 అదనం
- నేటి నుంచి కొత్తరేట్లు


జనగామ జిల్లాలోని సింగరాజుపల్లి టోల్ ప్లాజా

జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా టోల్ ప్లాజాల వద్ద నేటి (శనివారం) నుంచి కొత్త రేట్లు అమలులోకి రానున్నాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమల్ల, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ప్రతిరోజు రెండు టోల్ ప్లాజాలను దాటుకుని సుమారు 18 వేల వాహనాలు ప్రయాణిస్తాయి. టోల్ ఫీజు 5శాతం వరకు పెంచడంతో కారు, బస్సు, ట్రావెల్స్, ట్రాన్స్‌పోర్టు వెహికిల్స్ వాహనాలపై అదనపు భారం తప్పడం లేదు. ఇదే క్రమంలో ఆర్టీసీ బస్సులపై పెద్దగా భారం లేకున్నప్పటికీ ఒకే రూట్‌లో రెండు టోల్ ప్లాజాలు ఉంటే మాత్రం ఎక్స్‌ప్రెస్, డీలక్స్ ప్రయాణికులకు అదనంగా రూ.10 వడ్డన వేస్తారు. హనుమకొండ నుంచి హైదరాబాద్ ఎంజీబీఎస్‌కు ఎక్స్‌ప్రెస్‌కు రూ.175, డీలక్స్ బస్సు సర్వీసుకు రూ.205 టికెట్ ధర ఉండగా డైరెక్టుగా వెళ్లే ప్రయాణికులకు టికెట్‌పై రూ.10 చొప్పున అదనంగా తీసుకుంటారు. జనగామ నుంచి సిద్దిపేట, సూర్యాపేట, హనుమకొండ, ఉప్పల్ వెళ్లే ప్రయాణికులకు మాత్రం గతంలో ఉన్న ఫీజులే వర్తించనున్నాయి. ప్రస్తుతం పల్లె వెలుగు బస్సు సర్వీసులకు టోల్ ఫీజు రూ.6, ఎక్స్‌ప్రెస్‌కు రూ.6, డీలక్స్‌కు రూ.9 చొప్పున టికెట్‌పై అదనంగా తీసుకుంటున్నారు. నేటి నుంచి కోమల్ల టోల్ ప్లాజా వద్ద కారు, జీపు, వ్యాన్‌కు సింగిల్ జర్నీకి రూ.120, రిటర్న్ జర్నీ కోసం అయితే రూ.175, సింగరాజుపల్లి టోల్ ప్లాజా వద్ద కార్, వ్యాన్, జీప్, లైట్ మోటారు వెహికిల్స్‌కు సింగిల్ రూ.35, డబుల్‌కు రూ.55 వరకు పెంచి తీసుకోనున్నారు.

తొమ్మిది నెలల తర్వాత నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదానికి కారకులై, ఒకరి మృతికి కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ రూరల్ సీఐ ఆర్ సంతోష్ తెలిపారు. తొమ్మిది నెలలకు టాస్క్‌పోర్స్ సాయంతో నిందితులు చిక్కారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వీరేందర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన దొడ్డ సునీల్‌రెడ్డి 2022 జూలై 7న జనగామ కోర్టులో పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై వెళ్లివస్తున్న క్రమంలో నిడిగొండ జెర్సీ పాలకేంద్రం వద్ద హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు సునీల్‌రెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి వెళ్లింది. ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సునీల్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అప్పటి నుంచి గుర్తు తెలియని వాహనంతో పాటు ప్రమాదానికి కారణమైన నిందితులను పట్టుకునేందుకు తొమ్మిది నెలలుగా పోలీసులు యత్నిస్తున్నారు. గురువారం టాస్క్‌ఫోర్స్ సహకారంతో రోడ్డు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించడంతో పాటు కారు డ్రైవర్ అజీజ్‌ఖాన్‌ను, ప్రమాద విషయం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచిన అబ్బాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.